సాక్షి కామారెడ్డి

మంగళవారం ၊ 10 ၊ అక్టోబర్ ၊ 2023



ప్రజావాణికి వినతుల వెల్లువ

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 144 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



సహనంతో ఉండాలి

పోలీసు అధికారులు విధుల్లో సహనంతో వ్యవహరించాలని రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్లా పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /23.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలి పెరుగుతుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్ (ఒక్కో ఖాళీ) తెలుగు, పొలిటికల్ సైన్స్ (రెండేసి ఖాళీలు) బోధించడానికి అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ కే విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు అక్టోబర్ 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలుంటాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సాత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌గౌడ్



భిక్కనూరు : తెయూ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం సుధాకర్‌గౌడ్‌కు నియమాక పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. సౌత్ క్యాంపస్ టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌ను సత్కరించారు. అధ్యాపకులు డాక్టర్ హరిత, ప్రతిజ్ఞ నాగరాజు, అంజయ్య, మోహన్‌బాబు, యాలాద్రి, సునీత, సరిత, నిరంజన్, నర్సయ్య, శ్రీకాంత్, వైశాలి, రమాదేవి పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన అల్పాహారం అందించాలి



కామారెడ్డి క్రైం : దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, రాష్ట్ర పరిశీలకుడు కే రవికాంత్ రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఇడ్లీ, పూరి, కిచిడి లాంటి వాటిని ప్రతిరోజు అందజేయాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కోసం వండిన అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

కామారెడ్డి టౌన్ : భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై కామారెడ్డి జిల్లా ఎన్నికల అధికారులతో వీసీలో మాట్లాడారు. ఎన్నికలపై కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి సూచనలిచ్చారు.

సమరానికి సై!

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నగారా మోగింది. షెడ్యూల్ విడుదలతోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు వంటి విషయాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు. రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను తొలగించాలని ఆదేశించారు.



- విడుదలైన ఎన్నికల షెడ్యూల్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఏర్పాట్లపై యంత్రాంగం బిజీబిజీ
- రాజకీయ పార్టీల్లో కదలిక

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలు ఉండగా, అన్ని స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 3న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలై 10వ తేదీ వరకు కొనసాగనుంది. 13న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు రెండు రోజులు అంటే నవంబర్ 15 వరకు అవకాశం కల్పించారు. 30న ఎనినకల కోసం పోలింగు జరుగనుంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈవీఎంల ద్వారానే ఎన్నికలు జరుగుతాయి. కాగా ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం బిజీ అయ్యింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పార్టీలకు చెందిన గోడ రాతలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ కూడా మొదలైంది. ఇప్పటికే ఎన్నికల కోసం అధికారులు, సిబ్బంది సిద్ధం చేశారు. షెడ్యూల్ విడుదల కావడంతో యంత్రాంగం మొత్తం ఎన్నికలకు సంబంధించిన పనులపై దృష్టిని కేంద్రీకరించనున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారిక కార్యక్రమాలకు తెరపడింది. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగాల్సి ఉన్నా వాటిని రద్దు చేసుకున్నారు.

ఇక ఎన్నికల ప్రచారం..

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీల్లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఇంత కాలం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో జనంలోకి వెళ్లారు. షెడ్యూల్ విడుదల కావడతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు కత్తెర పడింది. ఇక ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ పోటీ చేయనున్నారు. ఇక్కడ టిక్కెట్ల కోసం పోటీ లేకపోవడంతో ఆయన ఇప్పటికే ఊళ్లన్నీ చుట్టేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. బీజేపీ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఆలయాలు, కుల సంఘాల కార్యక్రమాలకు హాజరయ్యారు. అలాగే మేరా మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఊళ్లన్నీ చుట్టేశారు. అన్ని గ్రామాల్లో కుల సంఘాలతో ఆయన మమేకం అయ్యారు. త్వరలో ఎన్నికల ప్రచారాన్ని షురూ చేయనున్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల్లో మాత్రం అటు కాంగ్రెస్ పార్టీ, ఇటు బీజేపీ పార్టీల అభ్యర్థులెవరో ప్రకటించకపోవడంతో అక్కడ ప్రచారం అంతంతమాత్రంగానే ఉంది. అభ్యర్థులను ప్రకటిస్తేగానీ ప్రచారం మొదలుపెట్టే పరిస్థితి లేదు. షెడ్యూల్ విడుదల కావడం, ఎన్నికలకు కేవలం యాభై రోజుల సమయం మాత్రమే ఉండడంతో రెండు మూడు రోజుల్లో అభ్యర్థులెవరో తేలిపోతుందని భావిస్తున్నారు.

తనిఖీలు షురూ..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తనిఖీలు షురూ అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు, ఇతర సామగ్రి తరలిస్తే సీజ్ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులపై పోలీసులు నిఘా పెట్టారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఇప్పటికే తనిఖీలు మొదలుపెట్టారు. కోడ్ అమల్లోకి వచ్చాక ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. అలాగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు కూడా చేయరాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు కోడ్ రాకముందే ఆగమాగం కార్యక్రమాలన్నీ పూర్తి చేశారు.

నియోజక వర్గం	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	255	1,18,718	1,27,080	24	2,45,822
ఎల్లారెడ్డి	270	1,04,768	1,12,673	03	2,17,444
జుక్కల్	255	97,618	1,00,269	10	1,97,897
బాన్సువాడ	258	92,295	1,00,608	08	1,92,911

పకడ్బందీగా నిర్వహిస్తాం

- నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

సాక్షి, కామారెడ్డి : ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిబంధనలను అతిక్రమించే వారిపై ఖచ్చితమైన చర్యలుంటాయన్నారు. ఉద్యోగులైనా, రాజకీయ పార్టీలైనా సరే ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాలకు కలిపి 791 పోలింగు బూత్‌లు, బాన్సువాడ నియోజకవర్గానికి సంబంధించి మన జిల్లా పరిధిలో 122 పోలింగు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలను ప్రకటించామన్నారు. యువ ఓటర్లే ఎక్కువగా ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర పోలింగు శాతం కన్నా మనం ఎక్కువగా నమోదు చేశామని, పట్టణాల్లో పోలింగ్ శాతం కొంత తగ్గిందని, ఈ సారి పెరిగేలా చూస్తామన్నారు. మహిళలతో మహిళల కోసం పోలింగు కేంద్రాలను మండలానికి ఒకటి ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని, దివ్యాంగులు, యువ ఓటర్ల కోసం కూడా ప్రత్యేక కేంద్రాలు నెలకొల్పుతామన్నారు. అభ్యర్థులు, పార్టీల ఖర్చులపై నిఘా ఉంటుందన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రెండు షిఫ్టులుగా పని చేస్తాయని, ఎక్కడైనా ఏదైనా ఫిర్యాదు వస్తే 100 నిమిషాల్లో చేరుకుంటామన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ముంద్రించేముందు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మీడియాలో ప్రకటనలకు సంబంధించిన అనుమతి తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం నేరమన్నారు. అధికార యంత్రాంగం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వీసీలో అధికారులను ఆదేశించారు. 24 గంటల్లోగా రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

తెలంగాణ వచ్చాకే అభివృద్ధికి నిధులు

- వాటితోనే నియోజక వర్గం అభివృద్ధి
- దుర్కిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : తెలంగాణ వచ్చాకే అభివృద్ధికి నిధుల వెల్లువ ఉంది అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దుర్కి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా దుర్కి నుంచి బీర్కూర్ వరకు రూ. 13 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 110 డబుల్ బెడ్రూం ఇళ్లను, కుర్మ సంఘం, కమ్మరి సంఘం, నూతన పల్లె దవాఖానా భవనం, మసీదు తదితర పనులను ప్రారంభించారు. యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రారంభించి ఆయన గొప్పతనాన్ని యువతకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ పాలనలో కేవలం నియోజకవర్గం అభివృద్ధికి రూ. 50 లక్షలు ఏడాదికి ఇచ్చేవారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, రాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్, ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్, నాయకులు ఏడె మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



దుర్కిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

స్పీడ్ పెంచనున్న బీఆర్‌ఎస్ !

- 15న పార్టీ అభ్యర్థులకు బీ ఫాంలు
- వచ్చేనెల 9న కామారెడ్డిలో నామినేషన్ వేయనున్న సీఎం కేసీఆర్
- అదే రోజు సాయంత్రం బహిరంగ సభకు ప్లాన్

సాక్షి, కామారెడ్డి : అభ్యర్థుల ఖరారుతో పాటు ప్రచారంలోనూ ముందున్న అధికార బీఆర్‌ఎస్ పార్టీ మరింత దూకుడు పెంచనుంది. రాష్ట్రంలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులకు ఈ నెల 15న జరిగే సమావేశంలో బీ ఫాంలు అందజేస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా కామారెడ్డి నుంచి పోటీ చేయనున్న సీఎం కేసీఆర్ వచ్చే నెల 9న నామినేషన్ వేయనున్నారు. అదే రోజు సాయంత్రం కామారెడ్డిలో బహిరంగ సభలో సీఎం ఎన్నికల ప్రసంగం చేయనున్నారు. సీఎం పోటీ చేస్తున్న నియోజక వర్గం కావడంతో పార్టీ నాయకత్వం కామారెడ్డిపై ఫోకస్ చేస్తోంది. ఇప్పటికే మంత్రి కేటీఆర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలకు మంత్రి కేటీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డితో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌లు ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు. నియోజకవర్గంలో పార్టీ నేతలు, శ్రేణుల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించేందుకు చర్యలు మొదలుపెట్టారు. కాగా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ఎమ్మెల్యేలంతా దాదాపు నెలన్నర కాలంగా ఊళ్లను చుట్టేశారు. షెడ్యూల్ వెలువడే క్షణం వరకు కూడా కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో మిగతా వాటిని విరమించుకున్నారు. కొన్ని చోట్ల స్థానిక నేతలతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించారు. ఏది ఏమైనా సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహించనున్న కామారెడ్డి నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇదే సమయంలో ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీలు కూడా మరింత దూకుడు పెంచనున్నాయి. దీంతో కామారెడ్డి నియోజక వర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతాయని భావిస్తున్నారు.



'రేషన్' మాఫియా

- తూకాల్లో గోల్‌మాల్
- ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఇష్టారాజ్యం
- కాంట్రాక్ట్ సిబ్బంది చేతుల్లో వ్యవస్థ
- తలలు పట్టుకుంటున్న డీలర్లు

కామారెడ్డి రూరల్ : రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసే ఎంఎల్‌ఎస్ పాయింట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆయా కేంద్రాల్లో కాంట్రాక్ట్ సిబ్బంది హవా నడుస్తోంది. దీంతో తూకంలో మోసాలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. బయోమెట్రిక్ విధానం కూడా ఎక్కడా అమలు జరుగుతున్నట్లు కన్పించడం లేదు.

అధికారుల నిర్లక్ష్యమే..

రైస్ మిల్లుల నుంచి ముందుగా స్టేజీ-1 గోదాంలకు బియ్యం సరఫరా జరుగుతుంది. అక్కడి నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు పంపిస్తారు. ప్రతినెలా రేషన్ డీలర్లకు కేటాయించాల్సిన బస్తాలను ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి పంపిస్తారు. నిబంధనల ప్రకారం ఒక్కో బస్తాలో 50 కిలోల 580 గ్రాముల బియ్యం తూకం (బస్తా బరువుతో కలిపి) రావాలి. అలాంటిది ఒక్కో బస్తాలో 5 నుంచి 10 కిలోల వరకు బియ్యం తక్కువగా వస్తుందని డీలర్లు చెబుతున్నారు. తూకం అయ్యాక డీలర్ బయోమెట్రిక్ వేలిముద్ర వేయాల్సి ఉంది. కాని జిల్లాలో ఎక్కడా ఇలా జరగట్లేదని డీలర్లు వాపోతున్నారు.



ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాలకు బదులు కూలీలను కూర్చోబెట్టి తూకం వేస్తున్న దృశ్యం

భారీగా తరుగు..

ఒకేసారి 50 క్వింటాళ్ల బియ్యంను కాంటా మీద ఉంచి వచ్చిన డీలర్ల అందరి చేత వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఆ వెంటనే స్టేజీ-1 నుంచి వచ్చిన లారీల్లో నుంచి బియ్యం బస్తాలను తూకం వేయకుండానే డీలర్లకు పంపే వాహనాల్లోకి దించుతున్నారని డీలర్లు చెబుతున్నారు. దీంతో రేషన్ దుకాణాలకు వచ్చిన బియ్యం బస్తాలలో తరుగు స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్కో బస్తాలో కనీసం 45 కిలోలు కూడా రావడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖచ్చితంగా తమకు కాంటా చేసిన తర్వాతే బియ్యం లోడింగ్ చేయాలని డీలర్ పట్టుబడితే వారిని టార్గెట్ చేస్తున్నారని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం తూకం చేసి ఇవ్వకపోయినా వేలిముద్రలు సమర్పించి స్టాక్‌ను తెచ్చుకుంటున్నారు.

పనిచేయని వేయింగ్ బ్రిడ్జి

జంగంపల్లి గోదాంలో వేయింగ్ బ్రిడ్జి చెడిపోయి దాదాపు రెండేళ్లకు వస్తుంది. దీంతో దానికి మరమ్మతులు చేయించకపోవడంతో తూకం వేయకుండానే రేషన్ డీలర్లకు లారీల్లో రేషన్ దుకాణాలకు పంపిస్తున్నారు. దీంతో కొందరు రేషన్ డీలర్లే లారీకి రూ.100, రూ. 120 చెల్లించి ప్రైవేట్ వేయింగ్ కాంటల వద్ద తూకం వేసుకుంటున్నారు. జగంపల్లి గోదాం నుంచి ప్రతి నెలా 137 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తారు. అంటే 137 మంది రేషన్ డీలర్లు తూకం వేసుకుంటే రూ. 13 వేలు చెల్లించాల్సి వస్తుంది. అదే ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద ఉన్న వేయింగ్ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తే రూ. 30 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో రేషన్ డీలర్లకు తూకంతోపాటు ఖర్చులు తగ్గుతాయంటున్నారు.



42.9 కిలోలు ఉన్న బియ్యం బస్తా

కాంట్రాక్ట్ ఉద్యోగులదే హవా..

జిల్లాలోని ప్రతి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు ఓ డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటాడు. ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇతర సిబ్బంది ఉంటారు. జిల్లా కేంద్రంతోపాటు చుట్టూ పక్కల ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు బియ్యంను సరఫరా చేసే ఎంఎల్‌ఎస్ పాయింట్ జంగంపల్లిలో ఉంది. ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న అధికారి సక్రమంగా విధులకు హాజరుకావట్లేదనే ఆరోపణలున్నాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటరే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని దాదాపు అన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్లలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నట్లు తెలుస్తుంది.

జిల్లాలో..	
రేషన్ దుకాణాలు	578
రేషన్ కార్డులు	2,53,773
బియ్యం సరఫరా	9,200 క్వింటాళ్లు
ఎంఎల్‌ఎస్ పాయింట్లు	7

"తూకం సరిగా వేయట్లేదు..



ప్రతిబస్తాకు 7 నుంచి 8 కిలోలు బియ్యం తక్కువగా వస్తున్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో నిబంధనల ప్రకారం కాంటా మీద బియ్యం బస్తాలు వేసి డీలర్ వేలిముద్రలు తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. ఒకసారి కాంట మీద బస్తాలు వేసి అలాగే ఉంచేస్తున్నారు. వచ్చిన డీలర్ల వేలిముద్రలు దానిపైనే సేకరిస్తున్నారు. ఒక లారీ నుంచి మరో లారీకి బియ్యంను డంప్ చేస్తున్నారు. దీంతో డీలర్లకు బియ్యం తక్కువగా వస్తున్నాయి.

– గౌరిశెట్టి రాజు, జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు, కామారెడ్డి

ఈ సారి వారం ముందు..!

ఎలక్షన్	నోటిఫికేషన్	నామినేషన్లకు చివరి తేది	పోలింగ్	కౌంటింగ్
2018	నవంబర్ 12	నవంబర్ 22	డిసెంబర్ 07	డిసెంబర్ 11
2023	నవంబర్ 03	నవంబర్ 10	నవంబర్ 30	డిసెంబర్ 03

- డిసెంబర్ 7న గత ఎన్నికలు
- ఈసారి నవంబర్ 30న

సాక్షి, కామారెడ్డి : రాష్ట్ర అసెంబ్లీకి గత ఎన్నికల్లో (2018) లో నోటిఫికేషన్ నవంబర్ 12న విడుదలై డిసెంబర్ 7న పోలింగ్ జరిగింది. డిసెంబర్ 11న కౌంటింగ్ నిర్వహించారు. ఈ సారి వారం రోజుల ముందుగానే నోటిఫికేషన్ వెలుబడి, వారం ముందే ఎన్నికలు, కౌంటింగ్ జరునున్నాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీల ప్రకారం ఈ సారి నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదలై అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టి నవంబర్ 10 వరకు పూర్తవుతుంది. నవంబర్ 30న పోలింగు జరుగుతుంది. డిసెంబర్ 3న కౌంటింగ్ చేపడతారు. అంటే వారం రోజుల ముందుగానే నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగు, కౌంటింగ్ జరిగిపోనున్నాయి.

హెచ్‌ఎంలు బోధనను పరిశీలించాలి

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు తప్పనిసరిగా తరగతి గది బోధనను పరిశీలించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు ప్రొఫెసర్ రవికాంతరావు ఆదేశించారు. సోమవా రం ఆయన జిల్లాలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాల, కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల, టేక్రియాల్ కేజీబీవీ లను సందర్శించారు. ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లతో సమీక్ష నిర్వహించారు. ప్రణాళిక ఆధారంగా బోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సరంపల్లి టీచర్ల పనితీరును అభినందించారు. ప్రతి టీచర్ తప్పనిసరిగా టీచింగ్ డైరీలు రాయాలన్నారు. పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. దేవునిపల్లి పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మోబిలైజేషన్ అధికారి శ్రీపతి, సబ్జెక్టు రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవికాంతరావు

క్లుప్తంగా

క్రాస్ స్టేట్ సైకిల్ ర్యాలీకి స్వాగతం



కామారెడ్డి టౌన్: క్రాస్ స్టేట్ సైకిల్ ర్యాలీకి సోమవారం రాత్రి కామారెడ్డి పట్టణంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్వాగతం పలికారు. ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్దకు వచ్చింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, సైకిల్ ర్యాలీ టీం లీడర్ రాజేష్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి రామ స్వామి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ విద్యార్థులకు శిక్షణ తరగతులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ కాలేజీలో వర్సిటీ విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. కో–ఆర్డినేటర్ మహమ్మద్ అతిక్ సుల్తాన్ ఘోరీ ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ ట్రైనింగ్ అకాడమీ సౌజన్యంతో స్కిల్, నాలెడ్జ్ అంశాలపై ఈ నెల 14వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ట్రైనర్ శ్రీహరి శిక్షణనిస్తున్నారు.

ఉర్దూ హెచ్‌వోడీగా మూసా ఖురేషీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా ప్రొఫెసర్ మహమ్మద్ మూసా ఖురేషీ నియామకమయ్యారు. సోమవారం తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి తన ఛాంబర్‌లో ఖురేషీకి ఉత్తర్వులు అందజేశారు.

దిల్‌రాజుకు పితృ వియోగం



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి వాసి, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తండ్రి శ్యాం సుందర్ రెడ్డి (86) సోమవారం రాత్రి హైదరాబాద్‌లో పరమపదించారు. ఆయన నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి (ఉమ్మడి ముదక్‌పల్లి)కి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో దహన సంస్కారాలు నిర్వహించనున్నారు.

22 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

సుభాష్‌నగర్: జిల్లాలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 22 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో తొమ్మిది మందిని జగిత్యాల జిల్లాకు అలాట్ చేసినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఇటీవల సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చిన విషయం తెలిసిందే.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్
- మొత్తం 144 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. మొత్తం 144 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, డీఏవో భాగ్యలక్ష్మి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కల్లం భూమిని ఆక్రమిస్తున్నారు



గ్రామంలో దాదాపు వెయ్యి మంది రైతులు కలిసి చదును చేసుకుని వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు కల్లంగా ఉపయోగించుకుంటున్న భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని సదాశివనగర్ మండలం కుప్రియాల్ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శివారులో ఉన్న ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిలో గతంలో ఉన్న 30 కొట్టాలను తొలగించి కొన్నేళ్లుగా కల్లంగా వాడుకుంటున్నామని తెలిపారు. ఓ వర్గానికి చెందిన వారు అక్కడ కుల సంఘ భవనం కోసం స్థలం ఉన్నప్పటికీ పక్కనే కల్లంగా వాడుకుంటున్న దాంట్లో నుంచి మరో ఎకరం ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

పోడు భూములుగా మార్చారు



ఇటీవల జరిపిన పోడు భూముల సర్వేలో భాగంగా అటవీ అధికారులు దాదాపు 400 మంది రైతుల పట్టా భూములను పోడు భూములుగా నమోదు చేశారని జుక్కల్ మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బస్వాపూర్, ఖండేబల్లూర్, కల్లాలి, మందాబాద్, బంగారుపల్లి, వజ్రకండి, మైలార్, కౌలాస్ గ్రామాలకు చెందిన దాదాపు 400 మంది రైతుల పట్టా భూములు అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా అటవీ భూములుగా చూపించారని వాపోయారు. న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పిల్లలు పోషించడం లేదు



ఆస్తులన్నీ పంచి ఇచ్చినా కడుపున పుట్టిన కుమారులు పోషించడం లేదని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇదేమిటని అడిగితే అడుక్కు తినమంటున్నారని వాపోయింది. పెద్దకొడప్‌గల్‌కు చెందిన అట్కారి లక్ష్మీబాయి భర్త నారాయణరావు 14 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఉన్న 5 ఎకరాల భూమిని ఇద్దరు కుమారులు పట్టా చేసుకోవడమే కాకుండా తన పేరిట ఉన్న ఎకరం భూమిని ఇటీవలే అమ్మేశారని ఆమె తెలిపింది. అప్పటి నుంచి ఇద్దరు కొడుకులు ఏడాదికి రూ.15 వేల చొప్పున తల్లి పోషణకు ఇస్తామని ఒప్పుకుని ఇవ్వడం లేదని చెబుతోంది.

– లక్ష్మీబాయి, పెద్దకొడప్‌గల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, టీజేఏస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్‌లు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని కళాశాలల విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహం, కళాశాల నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను కళాశాల ఆవరణల్లోనే అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సహనంతో వ్యవహరించాలి

- రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్లా



సూచనలిస్తున్న రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్లా

కామారెడ్డి క్రైం : పోలీస్ అధికారులు విధుల్లో ఓర్పు, సహనంతో వ్యవహరించాలని రిటైర్డ్ ఐజీపీ ఆనంద్ వర్ధన్ శుక్లా అన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులకు సాఫ్ట్ స్కిల్ డెవలప్మెంట్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఐజీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారికి ప్రజల సమస్యలు సామరస్యంగా ఓర్పుతో వినడం అవసరమన్నారు. ప్రజల అంచనాలకు తగిన విధంగా పోలీసులు స్కిల్ డెవలప్మెంట్ చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సేవలు అందించాలన్నారు. వాహనాల తనిఖీలు, నాకాబందీలలో పోలీసులు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. మరొకరితో పోల్చుకోవడం తగదన్నారు. ఆధునిక పరిజ్ఞానం కారణంగా శారీరక శ్రమ భాగా తగ్గిన నేపథ్యంలో ఆటపాటల ద్వారా ఉల్లాసంగా ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. రోల్ ఆఫ్ లీడర్షిప్, టీంవర్క్ తదితర అంశాలపై పోలీసులకు వివరించారు. వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో ఉన్న పోలీసింగ్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



జి.పరశురామ్



బి.అర్చన

కామారెడ్డి అర్బన్ : హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే సౌత్ జోన్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2023 పోటీల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొంటున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. అండర్–18 డెకత్లెన్, లాంగ్ జంప్‌కు జి.పరశురాం, అండర్–20 మహిళల విభాగం 800 మీటర్ల పరుగు పందెనికి అర్చన ఎంపికైనట్లు వారు తెలిపారు.

కులవృత్తుల్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం



చేప పిల్లల విడుదల కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

బీబీపేట: కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ అన్నారు. సోమవారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. మండలంలోని 18 చెరువులలో 7 లక్షల 29 వేల చేప పిల్లలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కులవృత్తులకు పెద్ద పీ ట వేస్తుందని, దీని వల్ల ప్రతి ఒక్కరు ఉపాధి పొందుతున్నారని అన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కె.వరదారెడ్డి, మత్స్యశాఖ బీబీపేట ఫీల్డ్ అసిస్టెంట్ శ్వేత, ఎంపీపీ బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించడం మన బాధ్యత



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గాలిరెడ్డి

భిక్కనూరు: పల్లెలను పట్టణాలకు దీటుగా తయారుచేసిన సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించడం అందరూ బాధ్యతగా స్వీకరించాలని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. సోమవారం అంతంపల్లిలో ఎన్నికల కోడ్ రాకముందే వేకువజామున పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, ఎంపీటీసీ మంజుల, నేతలు అందె మహేందర్‌రెడ్డి, అల కొండ గంగారెడ్డి, గోపాల్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం



అవగాహన కల్పిస్తున్న ఎంఏ సలీం

భిక్కనూరు: సమాచార హక్కు(స.హ) చట్టం వజ్రాయుధం వంటిదని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. సోమవారం జంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో స.హ. చట్టం 18వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పించారు. 2005లో ఈ చట్టం వచ్చిన తర్వాత దేశంలో పారదర్శకత పెరిగిందన్నారు. ప్రజలకు ఈ చట్టం వల్ల కావల్సిన సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు అవినీతి అక్రమాలు జరగకుండా చూసే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణిదీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళితులపై దాడికి నిరసనగా ధర్నా



బీబీపేటలో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

బీబీపేట: బీఆర్‌ఎస్ నాయకులు దళితులపై దాడిని ఖండిస్తూ సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీబీపేట చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. దళిత బంధు పథకంపై ఆదివారం రోజున తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామ దళితులు ప్రశ్నించడంతో వారి మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. దీంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలుబీఆర్‌ఎస్ నాయకులకు మాత్రమే అందుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, జనగామ సర్పంచ్ పాత రాజు, సలీం, స్వామి, మహేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శన్

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ అర్బన్: దేశ యువతలో ఇటీవల మాదకద్రవ్యాల వాడకం పెరిగిందని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. సోమవారం నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకంతో శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వీటి నివారణకు నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, సూర్య ఆరోగ్య సంస్థ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో 'ఓ మై ఫ్రెండ్' పేరిట సమగ్ర వ్యూహాన్ని రూపొందించామన్నారు. అడిషనల్ కమిషనర్ జయరాం, వైద్యులు రాజేంద్రకుమార్, డాక్టర్ విశాల్, నిషిత కాలేజీ చైర్మన్ నిఖిల్, కో ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల జీతం

- రూ.8,900 నుంచి రూ.11,570కు పెంపు
- జిల్లాలో 320 మందికి లబ్ధి

దొంకేశ్వర్(ఆర్మూర్): ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెరిగాయి. రూ.8,900 నుంచి రూ.11,570కి పెంచుతూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని 320 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు లబ్ధి చేకూరనుంది. వేతనాలు పెంచి తమను రెగ్యులర్ చేయాలని చాల కాలంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. కానీ ప్రభుత్వం రూ.2,670 (30శాతం) పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞలు తెలియజేశారు.

విద్యుత్ ఏపీటీఎస్ సీఐ బదిలీ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ ఏపీటీఎస్ సీఐ సురేష్ బదిలీ అయ్యారు. విద్యుత్ శాఖలో నిధులు దుర్వినియోగంపై గతంలో 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఘటనపై ఆయన విచారణ సక్రమంగా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు సీఐగా వచ్చి సుమారు ఐదేళ్లు అయింది. దీంతో ఆయనను హైదరాబాద్ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ ఏపీటీఎస్ సీఐగా జనార్దన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో హుజురాబాద్‌లో విధులు నిర్వహించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె వాయిదా



మాట్లాడుతున్న నాయకులు

ఖలీల్‌వాడి: మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను జిల్లాలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఏండీఎం కార్మిక యూనియన్ కార్యదర్శి చక్రపాణి సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, డీఈవో కమిషనర్‌తో మాట్లాడి పెంచిన వేతనం అమలు చేస్తామని చెప్పడంతో పాటు, సెప్టెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వస్తాయని హామీనివ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తమ అకౌంట్‌లోకి డబ్బులు వచ్చే వరకు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలుపుతామన్నారు. జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ, నాగలక్ష్మి, ఉమా, భూమయ్య, గంగాధర్, బాలరాజు, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రైయినేజీలో పడిన ఆటో



తాడ్వాయి: తాడ్వాయిలో సోమవారం ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన డ్రైయినేజీలోకి దూసుకెళ్లింది. రోజూ మాదిరిగానే కల్లు డిపో నుంచి కల్లు సీసాలను తీసుకొని వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి డ్రైయినేజీలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

తక్కువ ధరకు బంగారం అని మోసం

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నిజామాబాద్‌రూరల్: తక్కువ ధరకే బంగారం అమ్ముతానని మోసం చేస్తున్న నిందితుడు అన్వర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన అన్వర్ తక్కువ ధరకే బంగారం అమ్ముతానని ప్రజలకు మాయమాటలు చెప్పాడు. దీంతో ఎంతోమంది నిందితుడికి డబ్బు చెల్లించారు. ఇలా రూ.కోట్లు వసూలు చేసిన అన్వర్ పలువురికి నకిలీ బంగారం అంటగట్టాడు. మరికొంత మందికి రేపు మాపు అంటూ సాగదీశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన పలువురు రూరల్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఆశ్రయించగా అన్వర్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిర్మల్, జగిత్యాల జిల్లాలో కూడా అన్వర్ బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. అన్వర్ పేరు మీద బినామీ ఆస్తులున్నట్లు సమాచారం.

ఒకరిపై చీటింగ్ కేసు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌లో కిరాణ దుకాణం యజమానిని మోసగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు. రాజశేఖర్ దుకాణంలో ఓ వ్యక్తి రూ.540 విలువ చేసే ఆయిల్ ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. రాజశేఖర్ భార్య షాపులో ఉండడంతో ఫోన్ పేతో డబ్బులు చెల్లిస్తానని నమ్మించాడు. కానీ తన అకౌంట్‌లోకి డబ్బులు పంపించుకున్నాడు. ఆమె భర్తకు ఫోన్ చేయగా డబ్బులు జమ కాలేదని చెప్పాడు. అంతలోగా నిందితుడు పారిపోయాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



నవనీత (ఫైల్)

భిక్కనూరు: భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓడ్డెం నవనీత (24) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలు.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన నవనీత భిక్కనూరు ఠాణాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆమె కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతోంది. చికిత్స తీసుకుంటునే విధులు నిర్వహిస్తోంది. సోమవారం విధుల్లో భాగంగా నిజామాబాద్‌కు బస్సులో వెళ్తుండగా సదాశివనగర్‌కు చేరుకోగానే అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైంది. బస్సులో ఉన్న ప్రయాణికులు బస్సు నిలిపి 108కి సమాచారం అందించారు. వాహనం రాగానే అందులో నవనీతను కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి తండ్రి పెద్దనర్సింలు, తల్లి లక్ష్మి, సోదరుడు నరేశ్ ఉన్నారు. ఎస్సై సాయికుమార్‌తో పాటు పోలీసులు నవనీత మృతి పట్ల సంతాపం తెలిపారు.

నగరంలో మహిళ హత్య



లలిత (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని నాందేవ్‌వాడలో నివాసం ఉంటున్న బుక్యా లలిత(50) హత్యకు గురైంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన బుక్యా లలిత ఏడాది నుంచి నగరంలోని ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో పని చేస్తూ.. నాందేవ్‌వాడలో ఒంటరిగా ఉంటోంది. రెండు రోజులుగా లలిత ఫోన్ కలవకపోవడంతో సోమవారం ఉదయం ఆమె కూతురు వచ్చి చూడగా ఇంటికి తాళం ఉంది. దీంతో ఆమె మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇంటికి వెళ్లి చూశారు. ఏవైనా ఆధారాలు దొరుకుతాయని తాళం పగులగొట్టి చూడగా లలిత మృతదేహం నగ్నంగా ఉంది. రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శనివారం ఆమె ఎవరితోనో కలిసి ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే మహిళ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని అధికారులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ నరహరి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. పాల్వంచ మండలం భవానిపేట తండాకు చెందిన బానోతు శీను (45) భార్య రేణు కూతుర్లు కీర్తన, సువర్ణతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యకు కంటి సమస్య ఉండడంతో వైద్య పరీక్షల నిమిత్తం కామారెడ్డికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. ఘన్‌పూర్ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో కిందపడిన శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

నాగిరెడ్డిపేట: గుడికి వెళ్తున్నాని ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన మణిగిరి పోచమ్మ(47) గుడికి వెళ్తున్నాని చెప్పి ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోచమ్మ కోసం ఆమె కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోచమ్మ కుమార్తె భాగ్యలక్ష్మి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నలుగురుని అదుపులోకి తీసుకొని రూ.29,770 సీజ్ చేశామన్నారు.